క్లుప్తంగా

8న వైవీయూలో అంతర్ కళాశాలల క్రీడాఎంపికలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 8న ఉదయం వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. వైవీయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఖచ్చితంగా వైవీయూ పరిధిలోని కళాశాలల ఐడీకార్డు, స్టడీ సర్టిఫికెట్, ఫొటోపై ప్రిన్సిపాల్‌తో అటెస్టేషన్ చేయించుకుని హాజరుకావాలని వివరించారు. రైఫిల్, పిస్టల్ షూటింగ్‌లో పాల్గొనే క్రీడాకారులు వారి వెపన్స్ వారే తెచ్చుకోవాలని సూచించారు.

అర్చకులకు కూడా రైతు భరోసా

కడప కల్చరల్: దేవాలయ అర్చకులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా సౌకర్యం కల్పించనుందని జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ తెలిపారు. జిల్లాలో దేవదాయశాఖ పరిధిలోగల దేవాలయాలలో వంశ పారంపర్య అర్చకునిగా సేవలు అందిస్తున్న అర్చకులకుగల ఇనాం భూములకు ప్రభుత్వం రైతు భరోసా వర్తింపజేస్తోందని ఆయన తెలిపారు. ఇంతవరకు తమ ఆధీనంలో ఉన్న భూములకు ఈ పథకం వర్తించకుంటే సంబంధిత అర్చకులు వెంటనే ఈ సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. తమ పరిధిలోని అర్చక సమాఖ్య ప్రతినిధులు లేదా దేవాలయ ఈఓలు లేదా కడప నగరంలోని దేవదాయశాఖ కార్యాలయ ప్రతినిధుల నుంచి అర్జీ ఫారాన్ని పొందవచ్చన్నారు. అర్జీలో ఆధార్ కార్డు వివరాలు, బ్యాంకు అకౌంట్ వివరాలు, భూమి శిస్తు రశీదు లేదా ఈఓ ద్వారా పొందిన ధృవీకరణపత్రం, సెల్ నెంబరు నమోదు చేసి ఆయా ధృవీకరణ పత్రాలను అందజేయాలన్నారు.

రామాంజనేయుల సేవలు చిరస్మరణీయం



రాజ్యలక్ష్మికి చెక్కును అందజేస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నమండెం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన రామాంజనేయులు విధి నిర్వహణలో అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తెలిపారు. శనివారం కడప పాత కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామాంజనేయులు సతీమణి రాజ్యలక్ష్మికి అసోసియేషన్ తరఫున రూ. 20 వేల చెక్కును అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జీవన్ చంద్రశేఖర్, సెక్రటరీ పీఎండీ అలీఖాన్, ట్రెజరర్ కేపీ శ్యామూల్ రొనాల్డ్, కడప రెవెన్యూ డివిజన్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'భారతదేశం-ఎన్నికలు' రౌండ్ టేబుల్ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : భారత ఎన్నికల సంఘం ప్రభుత్వ నియంత్రణకు అతీతంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో సుప్రీం కోర్టు శుక్రవారం వెలువరించిన తీర్పు నేపథ్యంలో 'భారతదేశం-ఎన్నికలు' అనే అంశంపై ఆదివారం ఉదయం 10.30 గంటలకు కడపలోని కాగితాలపెంటలో ఉన్న తమ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటులో చట్టం చేసేవరకు ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్ల నియామకం జరగాలని సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించిన నేపథ్యంలో తాము రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ వర్గాలు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఉద్యోగులపై ఒత్తిడి సరికాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: చెత్త పన్ను వసూళ్లపై ఉద్యోగులపై ఒత్తిడి చేయరాదని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు చెత్త పన్ను చెల్లించకపోతే ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. సచివాలయ సిబ్బంది చెత్త పన్ను వసూలు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. కడప నగర పాలక సంస్థ వసూలు చేస్తున్న చెత్త పన్నుపై కౌన్సిల్ సమావేశంలో ప్రతి ఇంటి నుంచి రూ.40 వసూలు చేయాలని తీర్మానం చేసిందన్నారు.

దళితులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం దళితులందరికీ ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దళితులు ఎక్కడ ఉన్న వారందరికి 200 యూనిట్లు విద్యుత్ ఇవ్వాలన్నారు. దళితులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్న పాలక ప్రభుత్వాలు దళిత కాలనీలు కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటే ఉచిత విద్యుత్ వర్తించదని చెప్పడం సరికాదన్నారు. డీజీహెచ్‌పీఎస్ నాయకులు వెంకటేశు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం.. గంగమ్మ తల్లి

- నేడు చిన్నకుడాల గంగమ్మ తిరునాల
- అమ్మవారి రథోత్సవం
- ఏర్పాట్లలో ఆలయ కమిటీ

లింగాల : భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన చిన్నకుడాల గంగమ్మ తిరునాల ఆదివారం నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వహిస్తోంది. మండలంలోని పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో వెలసిన గంగమ్మ దేవత ఆలయంలో తిరునాల నిర్వహిస్తున్నారు. ఆలయాల చరిత్రలోకి వెళితే పూర్వం చిన్నకుడాల, పెద్దకుడాల అనే గొర్రెల కాపరులు ఇక్కడికి వలస వచ్చి గొర్రెలను మేపుకునేవారు. ఈ గ్రామాల మధ్యలో ఉన్న మోతకల వంకలో ఎంతటి కరువు కాటకాలు వచ్చినా నీరు పుష్కలంగా ఉండేది. అందువల్ల వంకకు అటువైపు చిన్నకుడాల, ఇటువైపు పెద్దకుడాల స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వారి కులదైవమైన గంగమ్మ దేవతలను ప్రతిష్ఠించుకున్నారు. వారి పేర్లతోనే నేడు చిన్నకుడాల, పెద్దకుడాల అనే గ్రామాలు వెలిశాయి. నాటి నుంచి ఆయా గ్రామాల్లో మహా శివరాత్రి తర్వాత వచ్చే రెండవ ఆదివారం గంగమ్మ తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



సర్వాంగ సుందరంగా పెద్దకుడాల గంగమ్మ దేవాలయం

మహా శివరాత్రి రోజున కంకణ ధారణ

మహాశివరాత్రి రోజున ఆయా ఆలయాలలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించి తిరునాలకు అంకుర్పారణ చేశారు. ఆలయాల కమిటీ చైర్మన్ల ఇళ్ల నుంచి అమ్మవారి ఆభరణాలు తీసుకొని డప్పు వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా ఆలయాలకు తీసుకొచ్చి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు ఆలయాల ధ్వజ స్థంభాలపై అఖండ జ్యోతిని వెలిగిస్తారు. ఆ రోజు నుంచి తిరునాల ముగిసేవరకు జ్యోతి ఆరిపోకుండా కాపాడుతూ వస్తారు. అదేవిధంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారిని తిరునాలకు మేలుకొల్పుతారు.

దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో పెద్దకుడాల గంగమ్మ దేవత

భక్తుల కోరికలు తీరుస్తున్న గంగమ్మ దేవాలయాలు అదే రీతిలో భక్తుల సహాయ సహకారాలతో దినదినాభివృద్ధి చెందుతున్నాయి. ఈ ఏడాది పెద్దకుడాల గ్రామంలోకి వెళ్లే ముఖద్వారం వద్ద పాడా నిధులతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి స్వాగత ద్వారం నిర్మించారు.

నేడు అమ్మవారి రథోత్సవం

తిరునాల రోజు గంగమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి రానున్నారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా ఉండేందుకు ఎస్‌ఐ హృషికేశవరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు.

లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి

కడప ఎడ్యుకేషన్: నేడు చాలా మంది అమాయక మహిళలు లైంగిక దోపిడీకి గురై పలువురి చేతులో మోసపోతున్నారని దీనికి వ్యతిరేకంగా అందరూ పోరాటం చేయాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవెలప్‌మెంట్ వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని సూచించారు. శనివారం ప్రపంచ లైంగిక వ్యతిరేక పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థిని బాగా చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు. క్షణిక ఆలోచనలకు లోనై నిండు జీవితాలను బలిచేసుకోవద్దని సూచించారు. మహిళా ఎస్‌ఐ జ్యోతి, వన్‌స్టాప్ సెంటర్ సైకో సోషియల్ కౌన్సిలర్ సునీత, యాంటి సెక్సువల్ హరాస్‌మెంట్ కన్వీనర్ రాధ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ శర్మిలా భాను, కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని

వైఎస్సార్‌సీపీ నాయకులకు సన్మానం



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు శనివారం నగరంలోని మాసాపేటలో ఘనంగా సన్మానం జరిగింది. మార్కెట్‌యార్డు డైరెక్టర్ సంపత్‌కుమార్, మహిళా నాయకురాలు చైతన్య, నగర పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీసీ సెల్ అధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, ఎస్సీ సెల్ వినోద్‌కుమార్, వైఎస్సార్ టీయూసీ జాషువ, సేవాదళ్ సమరనాథరెడ్డి, ఎస్టీ సెల్ వేణుగోపాల్ నాయక్, గ్రీవెన్స్‌సెల్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్స్ సెల్ శివనాయక్, విద్యార్థి విభాగం అధ్యక్షులు సాయిదత్తలను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్టతకు, రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపొందేందుకు తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు.

తెలుగు సాహిత్య విమర్శకుల్లో రారా అగ్రగణ్యుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యుడు రాచమల్లు రామచంద్రారెడ్డి అని ప్రముఖ కథా రచయిత కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న పుట్టపర్తి నారాయణాచార్యుల శాఖా గ్రంథాలయంలో శనివారం రాత్రి మిత్రజ్యోతి సాహితీ సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో రారా రాసిన లేఖల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి కొత్త జవసత్వాలను చేర్చి కొత్త సంచలనాల వెంట పరుగెత్తించిన విమర్శకుడు రారా అన్నారు. విమర్శకుడిగానే కాకుండా ఆయన కల్పనా సాహిత్య కథలను రచించారన్నారు. కారల్ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలను తెలుగులోకి అనువదించారని చెప్పారు. తెలుగు అధ్యాపకుడు హజరతయ్యా మాట్లాడుతూ రారా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా ఆయన ఎక్కడా రాజీ లేకుండా బతికారన్నారు. కథారచయిత దాదా హయత్ మాట్లాడుతూ విమర్శకులుగా గుర్తింపు తెచ్చుకున్న రారా కథా సాహిత్యం ఎంతో శిల్ప ప్రమాణాలతో వస్తు నిష్టతతో ఉంటుందన్నారు. ఈ సభకు డాక్టర్ దస్తగిరి అధ్యక్షత వహించారు. మిత్రజ్యోతి సభ్యుడు డాక్టర్ పవన్‌కుమార్, జేవీవీ నాయకులు తవ్వా సురేష్, రాజేష్, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, మహమూద్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పల్లవోలు రమణ, సృజన శీను తదితరులు పాల్గొన్నారు.



రారా లేఖల సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మొల్ల మహిళలకు స్ఫూర్తి

గోపవరం: మహాకవయిత్రి మొల్లమాంబ మహిళలకే స్ఫూర్తిదాయకమని సాహితీవేత్త బ్రహ్మశ్రీ సిద్ధవటం సత్యనారాయణశర్మ అన్నారు. మొల్ల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో మహిళా స్ఫూర్తి మొల్ల అనే అంశంపై సాహితీ ప్రియులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత విదుషీమణి మహాకవయిత్రి మొల్ల అని కొనియాడారు. సభాధ్యక్షుడు, సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్ల రచించిన రామాయణంలో సీత పాత్ర ద్వారా మహిళా ఔన్నత్యానికి పెద్దపీట వేశారన్నారు. అనంతరం సిద్దవటం సత్యనారాయణశర్మను శాలువా, నగదు పారితోషికం, మొల్ల రామాయణ పుస్తక ప్రసాదంతో సత్కరించారు. పీఠం కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, పార్వతి, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాని జిల్లా ఎస్‌బీసీసీ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కెతుర తెలిపారు. శనివారం ఆమె నగరంలోని అశోక్‌నగర్-3 అంగన్వాడీ కేంద్రంలో, చిన్నచౌకు ఎస్టీ కాలనీ, అశోక్‌నగర్‌లోని సచివాలయ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే తమ దృష్టికిగానీ, ఐసీడీఎస్ సిబ్బందికిగానీ తెలియజేయాలన్నారు. అలాగే చిన్న పిల్లలకు చిన్నప్పటి నుంచే చేతులను శుభ్రంగా ఉంచుకోవడం నేర్పించాలన్నారు. అలాగే బాలింతలు, గర్భిణులు కూడా పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా చూడాలన్నారు. ఈ విషయంలో అందరినీ చైతన్యవంతులను చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి ఫౌండేషన్ ప్రతినిధి రహమతున్నీసా, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి బాల్య వివాహాల కట్టడిపై అవగాహన కల్పిస్తున్న కెతుర

కడపలో పోలీసుల విస్తృత తనిఖీలు



చంద్రమౌళీనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎస్‌కే రోషన్

కడప అర్బన్: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప ఒన్‌టౌన్ పరిధిలోని ఎర్రముక్కపల్లిలోని పూసలవీధి పరిసరాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, పెద్ద ఓబన్న తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. రికార్డులు లేని మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

- కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. కాలనీలోని అనుమానిత ప్రాంతాల్లో చిన్నచౌక్ ఎస్‌ఐ ఎస్.కే.రోషన్ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ప్రమాదరకరంగా ఉన్న మ్యాన్‌హోల్

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పటల్‌రోడ్డు చిట్టిచివరి వీధిలోని మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన పైకప్పు పగిలిపోయిని ప్రమాదరకరంగా ఉంది. ఈ రహదారిలో నిత్యం ఉదయం 5 గంటలకే యోగాకు వెళ్లే వాళ్లు చాలామంది ద్విచక్ర వాహనాలో వెళుతుంటారు. ఇందులో మహిళలు కూడా ఉంటారు. వీరితోపాటు పాఠశాలలకు వెళ్లే పలువురు చిన్నారులు ఈ దారి వెంబటి నిత్యం నడుచుకుంటూ వెళ్తుంటారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీ మ్యాన్ హోల్‌పై పగిలిన పైప్పును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పదిలో ఉత్తమ ప్రతిభ చూపాలి

డీఈఓ దేవరాజ్

రాజుపాళెం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ్ పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు, వెలవలి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పరీక్షలంటే భయాందోళన చెందవద్దని, ఇష్టపడి చదివి పరీక్షలు రాయలని తెలిపారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి

రాజుపాళెం: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ మధుసూదన్ గౌడ్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని సర్వజ్ఞ హైస్కూల్ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ వెంకటశివారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రముఖ డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, అవధాని నరాల రామారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

స్విస్ట్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ఇన్ స్కిల్ కార్పొరేటివ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు అశీష్‌కుమార్, వెంకట్‌లు విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నిక్స్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ రాజోలి సాయి శరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రాజగోపాల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

కమలాపురం: ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని ఎంఈఓ జాఫర్ సాదిక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రగతి హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెస్ట్-2023ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు.అందుకు సైన్స్‌ఫెయిర్లు ఉపయోగ పడతాయన్నారు.

రవీంద్రారెడ్డి గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలాపురం నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించామన్నారు. ప్రస్తుతం గతంలో కంటే మరింత మెజార్టీ సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు వీరప్రతాప్ రెడ్డి, మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వెన్నపూస'తోనే సమస్యల పరిష్కారం

చెన్నూరు : నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఓటర్లు ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. విద్యావంతుడు ,మృదు స్వభావి వెన్నపూస రవీంద్రారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రులైన ఓటర్లు టీడీపీ మోసపూరిత మాటలను నమ్మకుండా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు, పాలనా తీరును చూసి ఈ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డికి అండగా నిలవాలని కోరారు.ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఆర్, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీలు రఘురాంరెడ్డి, నాగిరెడ్డి, సాదిక్ అలీ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరులో విస్తృత ప్రచారం

చెన్నూరు : చెన్నూరులోని కొత్త గాంధీనగర్, అరుంధతినగర్‌తోపాటు మండలంలోని రామనపల్లి, కొండపేటలలో సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసులురెడ్డి, కిరణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పర్యటించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

కమలాపురం : వైఎస్సార్ సీపీ బలపరచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి కోరారు. శనివారం కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లె, అగస్త్యలింగాయపల్లె, జె.కొత్తపల్లె గ్రామాల్లో తిరిగి గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులను కలసి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు

కడప కల్చరల్ : శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం కడప నగరంలో వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ విజయదుర్గాదేవి కాలనీలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీ పుష్పాండజ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి స్వామి దివ్యజ్ఞానానంద హాజరయ్యారు. ఉత్సవాలలో భాగంగా స్థానిక విజయదుర్గాదేవి కాలనీ పార్కు వద్ద నుంచి పవిత్ర జలాలుగల అలంకరించిన కలశాన్ని ఊరేగింపుగా భక్తులు శ్రీ విజయదుర్గాదేవి ఆలయానికి చేర్చారు. అక్కడ ముఖ్య అతిథి స్వామి దివ్య జ్ఞానానంద ఆధ్వర్యంలో అమ్మవారికి బిందెసేవ, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికప్రముఖులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాలనీవాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

చట్టాలపై అవగాహన ఉండాలి

– జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కవిత

వైవీయూ: మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ ఉమెన్ వీక్ (4నుంచి 11 వరకు) పురస్కరించుకుని మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కుటుంబ చట్టాలు, మెయింటినెన్స్ చట్టాలు, గృహ హింస, పౌర, క్రిమినల్ చట్టాలు, వరకట్న మరణం తదితర చట్టాల గురించి వివరించారు. ప్రామిసరీ నోటు, వివాహవయసు, దిశచట్టం, 304బి, ఉచిత న్యాయసహాయం, జాతీయ లోక్‌అదాలత్‌లు, ప్రత్యేక లోక్‌అదాలత్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లు అయిన 1098, 181, 14567ల గురించి వివరించారు. న్యాయవాది చంద్రకాంతమ్మ, టెలీ లా న్యాయవాది అరుణకుమారి, కళాశాల డైరెక్టర్ శివవిష్ణుమోహన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు సుబ్బనరసయ్య, శ్రావణి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. కవిత

నేషనల్ లైన్‌మెన్ దివస్ ర్యాలీ

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ లైన్‌మెన్ దివస్ కొత్తగా ప్రకటించడంతో శనివారం ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని లైన్‌మెన్లు, ఇతర విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ డివిజన్ కార్యాలయం నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు జరిగిన ఈ ర్యాలీని ఈఈ జి.శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ లైన్‌మెన్ల దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇన్ని రోజులకు తమ శ్రమను ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. డీఈఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈలు లక్ష్మీనారాయణ, ప్రియదర్శన్‌రెడ్డి, ఏఏఓ భాను, జేఏఓ బర్నబాస్, యూనియన్ నాయకులు మాధవ, చక్రనాయక్, రమేష్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివి

బద్వేలు అర్బన్ : విధినిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఐ.రవిచంద్రశేఖర్ పేర్కొన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మైదుకూరురోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు పగలనక, రాత్రనక శ్రమిస్తున్న లైన్‌మెన్ల సేవలను ప్రతిఒక్కరు గౌరవించాలని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన లైన్‌మెన్లకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అలాగే విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్లకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈలు విజయకుమార్, చిన్నయ్య, రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగులు

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి నాగరాజు

వేంపల్లె : చిన్నారులు రోగాల బారినపడకుండా ఉండాలంటే తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని.. అప్పుడే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో 1, 7, 8 సచివాలయాల పరిధిలోని సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 16ఏళ్ల వరకు పలు విడతలుగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తోందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ నిర్దేశించిన కాలమానిని ప్రకారం టీకాలు వేయించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న పిల్లలకు టీకాలు వేయడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపించినా అది వారి భవిష్యత్ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు తాళ్లపల్లె పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ నిజాముద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీసాలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ స్వాతిసాయి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నపిల్లల టీకాల కార్యక్రమం తనిఖీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎర్రగుడిపల్లె, జెండామాను వీధి ప్రాంతాలలో జరుగుతున్న చిన్నపిల్లల టీకాల కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టీకాలు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ వ్యాధికి ఏ టీకాలు వేయాలి, వేసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి ఏఎన్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను కలిసి వారికి అందుతున్న సేవలపై కూడా విచారించారు. విధి నిర్వహణలో ఏదైనా తప్పిదం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ వై.ప్రదీప్, జిల్లా వైద్య సిబ్బంది మౌనిరెడ్డి, రెడ్డయ్య, ప్రసాద్‌ల తోపాటు వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి నాగరాజు